ప్రజాశక్తి

గురువారం 22 ఫిబ్రవరి 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్, ఎంపి కేశినేని, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

నేటి నుండి సెంట్రల్లో 'సిపిఎం జన శంఖారావం'

ప్రారంభించనున్న రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : విజయవాడ పాయకాపురం ప్రకాష్‌నగర్ సెంటర్‌లో గురువారం ఉదయం 7.30 గంటలకు "సిపిఎం జన శంఖారావం" ప్రారంభమవుతుంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా "దేశాన్ని ముంచిన, రాష్ట్రాన్ని వంచించిన బిజెపి - వైసిపిలను గద్దె దించండి... నిరంకుశ బిజెపితో జతకడుతున్న తెలుగుదేశం కూటమిని ఓడించండి... నీతివంతమైన రాజకీయాలతో దేశ ఐక్యతకు, ప్రజలకు అండగా నిలిచే సిపిఎం, వామపక్షాలను బలపరచండి..." నినాదంతో వారం రోజులపాటు సెంట్రల్ నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించనున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు నేతృత్వం వహించే ఈ పాదయాత్ర ఉదయం 61వ డివిజన్లో, సాయంత్రం 62, 63, 64 డివిజన్లలో సాగుతుంది. 23వ తేదీ ఉదయం 29, 31, సాయంత్రం 36, 33 డివిజన్లలోనూ, 24న ఉదయం 26, 27, 28, సాయంత్రం 1వ డివిజన్ (మూడు కట్టలు)లోనూ, 25న ఉదయం 58, 59 జి+3, సాయంత్రం 60, 61 డివిజన్లలోనూ కొనసాగుతుంది. 26న ఉదయం 30, 32, సాయంత్రం 58వ డివిజన్ ఇందిరా నాయక్ నగర్, 57వ డివిజన్లలో జరుగుతుంది. 27న ఉదయం 23, 24, 25 డివిజన్లలో సాగుతుంది.

టెక్నాలజీపై నైపుణ్యం పెంచుకుంటే సత్ఫలితాలు

మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి - విజయవాడ : నైపుణ్య శిక్షణా తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని రాష్ట్ర గహ నిర్మాణ శాఖామాత్యులు జోగి రమేష్ అన్నారు. ఎస్ఇఇడిఎపి, డిడియు-జికెవై, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఉచిత శిక్షణ, ఉపాధి పొందిన యువత అపూర్వ ఆత్మీయ కలయిక (అల్యూమిని మీట్-2024)ను ఎస్ఇఇడిఎపి సిఇఒ ఎంకేవీ శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ రాష్ట్రంలో 2019 నుండి ఇప్పటి వరకు 76వేలకు పైగా యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వగా వారిలో 56వేల మందికి పైగా యువత ఉపాధి పొందారని తెలిపారు. అలాగే యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వటానికి రాష్ట్రంలో ఒక స్కిల్ యూనివర్సిటీ, రాష్ట్రవ్యాప్తంగా 27 స్కిల్ ట్రైనింగ్ కాలేజీలు, నియోజకవర్గానికి ఒకటి చొప్పున స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లు(స్కిల్ హబ్స్) ఏర్పాటు చేసి యువతకు పెద్ద (మిగతా 6లో)

బర్డ్ ఫ్లూపై అప్రమత్తం

- ఆకస్మికంగా చనిపోయే కోళ్ల నమూనాల సేకరణకు చర్యలు
- ఆర్ఆర్‌టి బృందాల ఏర్పాటు
- వెటర్నరీ వైద్యుని నేతృత్వంలో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ



ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా పశు సంవర్థక శాఖ అధికారులు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు కార్యాచరణ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పశు సంవర్థక శాఖ అధికారులు, సిబ్బందితో రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ల (ఆర్ఆర్‌టి) పేరుతో మండలానికి ఒకటి చొప్పున 17 మండలాలకు టీమ్‌లను రంగంలోకి దించారు. ప్రతి బృందంలో ఒక వెటర్నరీ వైద్యులు, ఇద్దరు పారా సిబ్బంది, ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లు సభ్యులుగా ఉంటారు. టీమ్‌కు వైద్యులు నేతృత్వం వహిస్తారు. ఆయా మండలాల పరిధిలోని కోళ్లలో సాధారణం కంటే ఎక్కువ మరణాలు సంభవించినా, ఆకస్మికంగా కోళ్లు చనిపోతున్నా తక్షణమే ఈ బృందాలు ఆయా ప్రదేశాలకు వెళ్లి ఎందుకు చనిపోతున్నాయనే దానిపై దృష్టి సారిస్తాయి. మరణించిన కోళ్ల నమూనాలు సేకరిస్తారు. కోళ్ల ముక్కు, నోటి నుంచి ద్రవాల శాంపిల్స్ సేకరిస్తారు. అనంతరం వాటిని విజయవాడలోని ల్యాబ్‌కు తరలిస్తారు. దీంతోపాటు బర్డ్ ఫ్లూ గురించి అవగాహన కల్పిస్తారు. బయో సెక్యూరిటీకి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పిస్తారు. రెగ్యులర్‌గా వచ్చే వ్యాధులు, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రిమిసంహారక విధానాలను వివరిస్తారు. తాగునీటి జాగ్రత్తలు (వాటర్ శానిటేషన్), ఫారమ్‌లోకి వచ్చే కొత్త పక్షులు, జనాల సంచారాలపై పాటించాల్సిన నిషేధం తదితర జాగ్రత్తలను వివరిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా బర్డ్ ఫ్లూ అదుపులోకి వచ్చేంత వరకు జిల్లాలో ఆర్ఆర్‌టి బృందాలు క్షేత్ర స్థాయిలో విధుల నిర్వహణలో నిమగ్నమై ఉంటాయి.

ఎన్‌టిఆర్ జిల్లాలో 32 లక్షల కోళ్లు

ఎన్టీఆర్ జిల్లాలో చిన్నవి, పెద్దవి కలుపుకొని మొత్తం 50 వరకు కోళ్ల ఫారాలున్నాయి. 20వ లైవ్ స్టాక్ సెన్సెస్ ప్రకారం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో దాదాపు 32 లక్షల కమర్షియల్ కోళ్లు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు జిల్లాలో ఎలాంటి కేసులు లేవని అధికారులు చెబుతున్నారు.

తిరువూరు టిడిపి అభ్యర్థి రక్షణనిధి ?



ప్రజాశక్తి - తిరువూరు, విస్సన్నపేట : తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపిలో అనేక పరిణామాలు చోటు చేసుకోవడంతో ఆ పార్టీ కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది. ఆ పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థుల పేర్లు రోజుకొకటి తెరపైకి రావటమే అందుకు ప్రధాన కారణం. తాజాగా వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎ కొక్కిలిగడ్డ రక్షణనిధి టిడిపి నుండి పోటీ చేసేందుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, త్వరలో ఆయన టిడిపిలో చేరి ఈనెల 28న తిరువూరు రానున్నారని సర్వత్రా చర్చ జోరుగా సాగుతోంది. ఆ పార్టీలోని పలువురు (మిగతా 6లో)

శ్రీనివాసరెడ్డికి పరామర్శ



ప్రజాశక్తి - నందిగామ : దాడిలో గాయపడి ఒంగోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షులు మర్రిరెడ్డి శ్రీనివాసరెడ్డిని రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాల ప్రసాద్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా జ్వాల ప్రసాద్ మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో టిడిపి నాయకులపై, సాధారణ ప్రజలపై దాడులు చేయడం సర్వ సాధారణమైందన్నారు. రాష్ట్రంలో గంజాయి, మద్యానికి బానిసలయ్యారన్నారు. ప్రజాసంక్షేమం అభివృద్ధి ఒక్క టిడిపిలోనే సాధ్యమైందన్నారు. గతంలో శ్రీనివాసరెడ్డి రైతు సమస్యలపై పోరాడారని ఆయన సేవలను కొనియాడారు.

రెడ్డిగూడెంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'



మాట్లాడుతున్న దేవినేని ఉమా

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రాష్ట్రాభి వృద్ధికి పాటుపడే నేతను గుర్తించి, ఆలోచించి ఓటు హక్కు పొందిన యువత రాబోయే ఎన్నికల్లో ఓట్లు వేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, విజయవాడ టిడిపి పార్లమెంటు ఇన్చార్జి కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపునిచ్చారు. బుధవారం రెడ్డిగూడెం మండలంలో పరిధిలోని అన్నేరావుపేట, శ్రీరాంపురం, ముచ్చినపల్లి, కూనపరాజుపర్వ, కుదప గ్రామాల్లో జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ వాల్ పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి అవిష్కరించారు. యువత తొలిసారిగా వేసే ఓటు దేశ, రాష్ట్ర గతిని మార్చేదిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు విజయబాబు, జానలపాటి వేణుగోపాల్ రెడ్డి, అంజిరెడ్డి, యువనాయకుడు బొమ్మిన కోటేశ్వరరావు, అన్నేరావుపేట సర్పంచ్ బాణావతు ప్రశాంతి, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రాప్తాడు ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్‌పై దాడి, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై రాళ్లదాడికి ఒడిగట్టిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జర్నలిస్టులు కోరారు. జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నల్ల బ్యాడ్జీలు ధరించి సమావేశానికి హాజరై నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు ముత్యాల సైదేశ్వర రావు, ఏపిఎంపిఏ జిల్లా ఉపాధ్యక్షుడు మెటికల శ్రీనివాసరావు, అఖిలపక్ష కమిటీ టి ఎల్ ఎన్ మూర్తి పాల్గొన్నారు.

డ్రెయినేజీ పూడికతీత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొటికలపూడి ఓసీ కాలనీలో సిబ్బంది డ్రెయినేజీ పూడికతీత పనులను బుధవారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల నుంచి డ్రెయినేజీ పూడుకుపోయి మురుగునీటి పారుదల స్తంభించిపోయింది. దీంతో సర్పంచ్ రెంటపల్లి నాగరాజు, కార్యదర్శి సరోజా బాయి పర్యవేక్షణలో పొక్లెయిన్‌తో డ్రెయినేజీ పూడిక తీయించారు. కల్వర్టు సైతం పూడుకుపోవడంతో పూడికలు తీసి మురుగునీటి పారుదలకు మార్గం సుగమం చేశారు.



డ్రెయినేజీ పూడికలు తీస్తున్న కార్మికులు

రక్షిత మంచి నీటి సరఫరా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పురపాలక సంఘ పరిధిలోని ప్రధాన రక్షిత మంచి నీటి సరఫరా కేంద్రాన్ని మునిసిపల్ కమిషనర్ కె.హేమమాలిని బుధవారం పరిశీలించారు. వార్డులో పంపిణీ అవుతున్న మంచినీటి సరఫరా అయ్యే సమయాలను అడిగి తెలుసుకొని, రికార్డులను పరిశీలించారు. జనరేటర్ రూమ్‌ను పరిశీలించి, వాటర్ ట్యాంక్ లో నీటిని తీసుకొని స్వయంగా క్లోరిన్ టెస్ట్ నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ సిబ్బంది పనివేళలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో తాగునీటి సరఫరా విషయంలో నిరంతరం వార్డుల్లో పర్యటించి ప్రత్యేక దృష్టిసారించాలని ఇంజనీర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫణి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ హేమమాలిని

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నందిగామ : ముప్పాళ్ళ గ్రామంలో రూ.33 లక్షలతో అభివృద్ధి పనులకు నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్‌రావు బుధవారం శంకుస్థాపన చేశారు. గడపగడపకు - మన ప్రభుత్వం నిధులతో గ్రామంలో సిసి రోడ్లు - సీసీ డ్రెనేజీల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామని ఎంఎల్ఎ తెలిపారు. ప్రజా సంక్షేమం, గ్రామాల అభివద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పేదల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గతానికి భిన్నంగా సిఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వస్తువుల కల్పనలో పల్లెలు పట్టణాలతో పోటీపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ జగన్మోహన్‌రావు

శ్రీరాం చిట్స్‌లో బాధితుడి నిరసన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని శ్రీరామ్ చిట్స్ కార్యాలయంలో మంగళవారం నందిగామకు చెందిన చిరుమామిళ్ల సుబ్బారావు అనే బాధితుడు ధర్నాకి దిగాడు. బాధితుడు మాట్లాడుతూ తాను శ్రీరామ్ ఫైనాన్స్‌లో వెహికల్ ఫైనాన్స్ తీసుకున్నానని, వెహికల్ ఫైనాన్స్ మొత్తం క్లియర్ చేసినప్పటికీ ఎన్ఒసి ఇవ్వాలని అడగగా, ఎన్ఒసి ఇవ్వకపోగా ఎప్పుడో 2014లో పర్సనల్ లోన్ తీసుకున్నారని ఆ డబ్బులు 17,000 చెల్లించాలని అప్పుడు వెహికల్ కి ఎన్ఒసి ఇస్తామని కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎన్నోసార్లు ఎన్ఒసి ఇవ్వాలని అడిగినప్పటికీ స్పందించలేదని, తాను ఎలా రూ.17 వేలు కట్టాలో కాగితం రూపంలో తెలియజేయాలని అడిగానని అన్నాడు. అయినప్పటికీ శ్రీ రామ్ ఫైనాన్స్ వారు స్పందించలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తను పాత లోన్ తాలూకా స్టేట్మెంట్ అడగగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. ఓపిక నశించి ధర్నాకు దిగానని బాధితుడు తెలిపాడు. ఈ విషయమై కవరేజ్‌కి వెళ్ళిన మీడియా సిబ్బందిపై మేనేజర్ దురుసుగా ప్రవర్తించి, ఫోన్ లాక్కొని, క్యాబిన్ డోర్ వేసి కవరేజ్ చేసిన వీడియోలు ఫోటోలు డిలీట్ చేస్తేనే బయటికి పంపిస్తానని నిర్బంధించాడు. ఈ విషయమై మీడియా సిబ్బంది పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.



శరవేగంగా టిడ్కోగృహాల పనులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులోని టిడ్కో గృహ సముదాల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే అంతర్గత రోడ్లు, డ్రైనేజ్, సబ్ స్టేషన్, కరెంట్ పోల్స్, ఎలక్ట్రికల్ వర్క్స్, టైల్స్, పెయింటింగ్, వాటర్ సంప్, బోర్స్ తదితర పనులు వేగవంతంగా సాగుతున్నాయి. గతంలో టిడిపి వారు భూములు ఇచ్చిన యజమానులకు, నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్ టికి సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో ఇంతటి జాప్యం జరిగింది. ఇప్పుడు ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి రూ.45 కోట్లకుపైగా డబ్బులు మంజూరు చేయించి ఎల్అండ్‌టికి, భూ యజమానులకు చెల్లించారు. అప్పటి నుంచి అవరోధాలు తొలగిపోయాయి. పనుల్లో వేగం పెరిగింది. ఈ పనులు కూడా మరికొద్ది రోజుల్లో పూర్తయిపోయి లబ్ధిదారులకు ఇల్లు అందజేయనున్నట్లు ఎంఎల్ఎ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.



సామాజిక వృత్తులపై అవగాహన

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లీలావతి పాఠశాలలో సామాజిక వృత్తులపై బుధవారం విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ హెల్పర్స్ (సామాజిక వృత్తుల సహాయకులు) పేరిట విద్యార్థులకు అవగాహన కోసమని ఉపాధ్యాయుడు, రైతు, న్యాయవాది, డాక్టర్, సైనికుడు, పారి శుద్ధ కార్మికుడు, వంటి వేషధారణలో విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడత లక్ష్మీనారాయణ కుల వృత్తుల గురించి వాటి ప్రాముఖ్యతపై వివరించారు. కార్యదర్శి రాధాకుమారి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



వివిధ కులవృత్తుల వేషధారణలో విద్యార్థులు



శంకుస్థాపన చేస్తున్న ఉప సర్పంచ్ నాగమల్లేశ్వరరావు

టవర్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - గంపలగూడెం: దీర్ఘకాలికంగా వినగడప గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రాంత ప్రజలకు బిఎస్ఎన్ఎల్ టవర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికై పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించారు. ఆధునిక కాలంలో సైతం ఇబ్బంది పడుతున్న పరిస్థితుల నేపథ్యంలో బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి 80 లక్షలు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరైనట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక ఉపసర్పంచ్ మేచినేని నాగమల్లేశ్వరరావు బుధవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ టవర్ నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజల సెల్ఫోను కష్టాలు తీరనున్నాయి.



రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - గంపలగూడెం: తిరువూరుకు చెందిన ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో బస్సులోని ప్రయాణికులకు, ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... విజయవాడ నుండి తిరువూరు వస్తున్న బస్సును మేనవోలు నుండి విజయవాడ వస్తున్న లారీ ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్‌కు, ప్రయాణి కులకు గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం, కుడివైపు భాగం దెబ్బ తిన్నాయి. డ్రైవర్ రెండు కాళ్లకు తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు డ్రైవర్‌ను దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి బెంగళూరు వాస్తవ్యులు మల్లెల విజయభాను శర్మ, పద్మలత దంపతులు రూ.50వేలు విరాళంగా అందజేసినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.హేమలతా దేవి తెలిపారు.



ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి - మైలవరం : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం స్థానిక లీలావతి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కొడతా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మాతృ భాష తల్లితో సమానమని, దేశ భాషలందు తెలుగు లెస్స అని పూర్వకాలంలోనే తెలుగు భాష గొప్పతనం గురించి కవులు తెలిపారు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు పద్యాలు పాడి భావాలను వివరించారు. తెలుగు తల్లి చిత్ర పటానికి పూలమాలవేసి నినాదాలు చేశారు. రాధా కుమారి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని ముక్త్యాల రోడ్డు వరదరాజ స్వామి గుడి ఎదురు రూ.13 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్‌కు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండేలా కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో బీసీలకు కూడా ఇటీవల కమ్యూనిటీ హాల్ అందు బాటులోకి తెచ్చామన్నారు. వరదరాజస్వామి గుడి ఎదురుగా నిర్మించే భవనాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు.



కార్యక్రమంలో పాల్గొన్న సామినేని ఉదయభాను

సోషలిజానికి దిక్సూచి రెడ్ బుక్

ప్రజాశక్తి-గన్నవరం: సోషలిజం కోసం కృషి చేస్తున్న నాయకులకు రెడ్ బుక్ పుస్తకం ఒక దిక్సూచి అని ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు అన్నారు. బుధవారం రెడ్ బుక్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షత వహించగా వెంకట్రావు మాట్లాడుతూ కార్మిక ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్న క్రమంలో చేయాల్సిన పని పట్ల అవగాహన కల్పించేందుకు, ప్రతిఒక్కరూ తమ పనిని మెరుగుపర్చుకునేందుకు ఉపయుక్తంగా ఉంటుం దన్నారు. ఉద్యమ సహచరుల నుంచి, ఇతరుల నుంచి ఎదురవుతున్న ఆటంకాలను అధిగమించేందుకు అనుసరించాల్సిన పద్ధతులు మొదలుకొని సోషలిస్టు సమాజం సాధించుకునే వరకు కార్యకర్తలు అనుసరించాల్సిన పద్ధతులను తెలియజేసే పుస్తకమే రెడ్ బుక్ అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ మద్దుకూరి విజయకుమార్, మల్లంపల్లి జయమ్మ, మీరా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు



మోపిదేవిలో ర్యాలీ

పాత్రికేయులపై దాడి హేయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: పాత్రికేయుల మీద దాడి హేయమైన చర్య అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వింత సంజీవరెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాప్తాడు, కర్నూలు, అమరావతి తదితర పట్టణాల్లో పాత్రికేయుల మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు జి.నాగబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ మతీన్, కె గణేష్‌బాబు, సురేష్‌రెడ్డి, లింగాల సుధాకర్, కోకా ఫణిభూషణ్, పాల్గొన్నారు. **మోపిదేవి:** బుధవారం సాయంత్రం మోపిదేవి సెంటర్లో అనంతపురంలో జర్నలిస్టులపై జరిగిన దాడులకు నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి మండల టిడిపి అధ్యక్షులు నడకుదుటి జనార్దన్ రావు, మోపిదేవి జెడ్పిటిసి మల్లికార్జునరావు, మాజీ ఎంపిపి రావి నాగేశ్వరావు, రత్నగిరి, చందన రంగారావు, రత్న గోపాల్, భోగిరెడ్డి సాంబయ్య పాల్గొన్నారు.



ఖోఖో జట్టుకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయిలో ఖోఖో మహిళా విభాగంలో ద్వితీయ స్థానం పొందిన జట్టును జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అభినందించారు. ఈ నెల 9 వ తేదీ నుండి 13 వ తేదీ వరకు విశాఖలో ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి పోటీల్లో కృష్ణాజిల్లా గుడివాడ నెహ్రూచౌక్ -3 సచివాలయ పరిధిలోని మహిళ విభాగం ఖోఖో జట్టు ద్వితీయ స్థానం సాధించి, మూడు లక్షల నగదు బహుమతితో పాటు కప్పు, మెడల్స్, సర్టిఫికెట్ పొందారు.జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఝాన్సీ లక్ష్మి ఈ జట్టుతో బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్‌ను వారి చాంబర్లో కలిశారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు జట్టులో మహిళలను ప్రతి ఒక్కరిని అభినందించి, భవిష్యత్తులో కూడా ఇదే క్రీడా స్ఫూర్తి కొనసాగించి కృష్ణాజిల్లాకు మరిన్ని పతకాలు సాధించాలని కలెక్టర్ అభినందించారు. ఈ జట్టుకు తర్ఫీదు ఇచ్చిన కోచ్‌లు మడక ప్రసాద్, కె.అనురాధ, ఎస్.సుధీర్ పాల్గొన్నారు.

ఓటుపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం నగర పాలక సంస్థ మెప్మా ఆధ్వర్యంలో బుధవారం కోనేరు సెంటర్ నుండి బస్టాండ్ వరకు ఓటుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు పై అవగాహన కల్పిస్తూ నా ఓటే నా భవిష్యత్తు, ఓటు వేయడం నా బాధ్యత, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి, బుల్లెట్ కంటే బ్యాలెట్ బలమైనది అంటూ ఓటు విలువను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ ఎంఇ సాంబశివరావు, బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





ప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి-గుడివాడ: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషా సమితి అధ్యక్షులు డిఆర్‌బి ప్రసాద్‌ను బుధవారం పలువురు ఘనంగా సత్కరించారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద పట్టణ ప్రముఖులు నవభారత్ ఖాదీస్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్ ఆధ్వర్యంలో డిఆర్‌బి ప్రసాద్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సభ్యులు వల్లభనేని వరప్రసాద్, లింగం ప్రసాద్, బొగ్గవరపు తిరుపతయ్య, పుట్టి హరికుమార్, జండా దీనవాహి ఉమాకుమార్, యలమర్తి వెంకటకృష్ణారావు, పట్టపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి దరఖాస్తులకు గడువు పెంపు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): డిఎస్‌సి 2024 దరఖాస్తులు అభ్యర్థుల కోరిక మేరకు అప్లికేషన్‌ను ఫీజుతో సహా సమర్పించుటకు గడువును ప్రభుత్వం మరో మూడు రోజులు 25 రాత్రి 12 గంటల వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామ సచివాలయం, ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో గ్రామ స్వరాజ్యం సాకారమవుతోందని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. బుధవారం చల్లపల్లి మండలం మంగళాపురంలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన జగనన్న విలేజ్ క్లినిక్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లను ఎమ్మెల్యే రమేష్ బాబు, వైసిపి రైతు విభాగం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఈ స్థాయిలో విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు, పేదలకు విస్తృత సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యన్నారాయణ (నాని), సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు. పిఎసిఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, ఈఓఆర్డీ బూరెపల్లి అశోక్, పంచాయతీ ఈఓ సుబ్బారావు, సర్పంచ్లు వల్లూరు ఉమా, తోట శ్రీనివాసరావు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, చంద్ర దుర్గా సాగర్, మల్లంపాటి కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి-మోపిదేవి: బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన మోపిదేవిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... 14 సంవత్సరాల బాలికపై వరుసకు తాత అయిన 50 సంవత్సరాల అంకయ్య అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మంగళవారం రాత్రి బాలికకు తీవ్ర కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు నాలుగు నెలల గర్భవతిగా నిర్ధారించారు. మెరుగైన వైద్య పరీక్షల కోసం బాలికను మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అవనిగడ్డ డిఎస్పి మురళీధర్ తెలిపారు.

స్వర్ణకారులకు ప్రోత్సాహకాలు అందిస్తాం : కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వర్ణకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తాం అని మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర తెలిపారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక విశ్వబ్రాహ్మణ కాలనీలో స్వర్ణకారుల కార్యశాలను సందర్శించారు.ఈ సందర్భంగా స్వర్ణకారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను రవీంద్ర దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన రవీంద్ర మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వర్ణకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తాం అని అలాగే వారికి సువర్ణ అవకాశాలు కల్పిస్తాం హామీ ఇచ్చారు. అదే విధంగా స్వర్ణకారులకు సాంకేతికతను జోడించి వ్యాపార అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు.



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి హనుమాన్ జంక్షన్: నైతిక విలువలతో కూడిన విద్య ద్వారా మాత్రమే సమున్నత లక్ష్యాలతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. రామన్నగూడెం హైస్కూల్ హెచ్ఎం నరహరిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. విలువలతో కూడిన విద్యతో విద్యార్థుల ద్వారా నవసమాజస్థాపన సాధ్యమన్నారు. తదనంతరం 7 నుండి 10వ తరగతి వరకు పరీక్షల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు వెయ్యి రూపాయలు, ద్వితీయస్థానం పొందిన వారికి రూ.500 నగదు పురస్కారాలతో ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత డైరెక్టర్ కొట్నాని రామచంద్రరావు, శ్రీరామ్మూర్తి, ఉ పాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటేశ్వరరావు



నిరసన తెలుపుతున్న రైతులు

ధాన్యం డబ్బులు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్

సకాలంలో సాగునీరందక ఆటుపోట్లను భరించి ఆర్బీకేల ద్వారా అమ్మిన ధాన్యానికి నెలలు గడుస్తున్నా డబ్బు చెల్లించకపోవడం రైతులను మోసం చేయడమేనంటూ టీడీపీ యూనిట్ ఇంచార్జ్ చలసాని శ్రీనివాసరావు, జాస్తి భూపతిరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపులపాడు మండలం కాకులపాడు గ్రామంలోని ఆర్బీకే వద్ద బుధవారం రైతులతో కలిసి టీడీపీ, జనసేన నాయకులు నిరసన చేపట్టారు. కాకులపాడు ఆర్బీకే ద్వారా విక్రయించిన రైతుల్లో 80శాతంకు పైగా ఇంత వరకూ చెల్లింపులు జరగలేదన్నారు. అధికారులను అడిగితే ప్రభుత్వమే నేరుగా బ్యాంకు ఖాతాలకు జమచేస్తుందని చెబుతున్నారని, ధాన్యం విక్రయించిన మూడు వారాల్లోగా డబ్బులు జమఅవుతాయన్న ప్రభుత్వ హామీని నిలుపుకోలేక రైతులను నిలువునా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యాపారులు తక్కువ రేటు ఇస్తారని నమ్మించి ఆర్బీకేకు అమ్మాలని సూచించిన అధికారులెవరూ సమాధానం చెప్పట్లేదని మండిపడ్డారు. జనవరి 8వతేదీ నుండి ఆర్బీకేలకు ధాన్యం తోలిన రైతులకు కాకులపాడులోనే సుమారు రెండు కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆర్బీకే ద్వారా ధాన్యం అమ్మిన రైతుకు తక్షణం చెల్లింపులు జరపాలని లేకపోతే నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కామినేని శ్రీహరిరావు, దొప్పలపూడి బాబు, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



మాట్లాడుతున్న ఎలమందలయ్య

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి జెవివి కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా కొండపల్లిలోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జెవివి.కొండపల్లి శాఖ కార్యదర్శి ఎస్‌కె సర్దార్ సాహెబ్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మాతృభాషా ప్రాధాన్యత సెమినార్‌లో తెలుగు భాషా అధ్యాపకులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ తొలిబడి అమ్మఒడి అన్నారు మాతృభాష లేకపోతే మానవజాతి మనుగడ లేదన్నారు. హైకోర్టు న్యాయవాది ఏ ఎలమందయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ మాతభాషా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 నిర్వహించాలని యునెస్కో నిర్ణయించింది అన్నారు. భాషా సాహిత్యం, సాంస్కృతిక వివరాలను ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉంది అన్నారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పట్ల కామేశ్వర మాట్లాడుతూ నిజమైన బావ ప్రేరణ ప్రగతి మాతభాషతోనే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తెలుగు భాషా ఉపాధ్యాయులు బి.రాజు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్య పటన పోటీలు సామెతలు చెప్పడం చిత్రలేఖన పోటీ సదరశాలు లో పోటీ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగు భాషలోనే తెలుగువారి ఉన్నతి సాధ్యమని సంస్కృతి సాంప్రదాయాలకు భాష జీవనాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ గోవర్ధనమ్మ పాల్గొన్నారు.



వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి - తిరువూరు : 20 అంతస్తుల భవనానికి గట్టి పునాది ఎంత అవసరమో జగన్ ప్రభుత్వానికి వాలంటీర్లు కూడా అంతే అవసరమని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. తిరువూరు మండల పరిషత్ కార్యాలయం అవరణలో రూరల్ గ్రామ వాలంటీర్ల సన్మాన కార్యక్రమం ఎంపిడిఒ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే జగన్ తీసుకొచ్చిన వాలంటీర్లే అని చెప్పారు. తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో పట్టణ పరిధిలోని వాలంటీర్లను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్ల గట్ల స్వామిదాస్ చైర్ పర్సన్ గత్తం కాస్తూరిబాయితో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గద్దల భారతి జడ్పిటిసి యరమల రామచంద్రారెడ్డి, సొసైటీల అధ్యక్షులు కలకొండ రవికుమార్, తాళ్లూరు నవీన్, ఎంపిటిసిలు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కొండపల్లిలో వాలంటీర్లకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వాలంటీర్లకు వందనం పేరిట ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రోత్సాహకాలను కొండపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లను సన్మానించి మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ అవినీతి అనే మాటకు తావు లేకుండా అర్హతకలిగిన ప్రతి ఒక్క నిరుపేద కుటుంబాలకు మన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, దృఢ సంకల్పంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి పేద కుటుంబాలకు సేవ చేసుకునే బాధ్యతలను వాలంటీర్‌కు అందజేశారు. ప్రతి పేదవాడు మధ్యతరగతి వాడు సంతోషంగా ఉండటానికి, వాలంటీ వ్యవస్థ ముఖ్యకారణమని ఇంతటి సేవను చేస్తున్న ప్రతి వాలంటీర్‌కు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి గుంజి శ్రీనివాస్ మున్సిపల్ కౌన్సిలర్లు ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు వైసిపి కార్యకర్తలు అభిమానులు అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గురుమూర్తి

కార్మికుల సమస్యలపై పని చేసే వారిని ఎన్నుకోవాలి

ప్రజాశక్తి - విజయవాడ : కార్మికుల సమస్యలపై, వారి హక్కుల కోసం పని చేస్తున్న వామపక్ష అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో ఆదరించాలని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ఇసుకు ముఠా కార్మికులతో 1వ డివిజన్‌లో బుధవారం సమావేశం జరిగింది. ఐద్వా, సిఐటియు నాయకులు కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ... ఇసుక అందుబాటులో లేక ముఠా కార్మికులకు పనులు లేక పెరిగిన ధరలతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె కళ్యాణ్, నాయకులు కష్ణ భుజంగరావు, శ్రీను, చలం నాయుడు, మహిళా సంఘం నాయకులు షకీల, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జక్కంపూడికి వెళ్ల మార్గంలోని వైఎస్ఆర్ కాలనీ ప్రధాన రహదారిలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ గణేష్ నేతృత్వంలో సిబ్బంది బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహన దారులను నిలువరించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వివరాలు లేకుండా ఉపయోగిస్తున్న ఐదు ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ గణేష్ తెలిపారు.



జగ్గయ్యపేట మున్సిపల్ బడ్జెట్ రూ.19.60 కోట్లు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం బుధవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ బడ్జెట్ 2024-25 సంవత్సరానికి 19,60,27,686 బడ్జెట్ కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, నకిరికంటి వెంకట్, గీతా రాణి జగ్గయ్యపేట పట్టణానికి కృష్ణా జిల్లాలు సక్రమంగా సరఫరా చేసి రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. బీసీ వర్గానికి చెందిన ప్రజలు వారి యొక్క ఫంక్షన్‌లు కమ్యూనిటీ హాల్ అందుబాటులో లేకపోవడంతో రోడ్డుపైన చేసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని, వెంటనే బడ్జెట్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై తగిన నిధులు కేటాయించాలని కోరారు. పట్టణంలో శానిటేషన్ విషయంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఫోన్ చేసిన తీయలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. దీనిపై చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఇప్పటికి జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఏర్పాటుపై 41 సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు తమ కౌన్సిల్ ఏర్పడి రెండున్నర సంవత్సరాల కాలంలో పట్టణంలో 25 కోట్ల రూపాయల పనులు చేసినట్లు తెలిపారు. ఇది తమ కౌన్సిల్ కే గర్వకారణం అన్నారు. జగ్గయ్యపేట పట్టణ సమీపంలో 150 అడుగుల జాతీయ జెండాను ప్రభుత్వ విప్ ఉదయభాను సహకారంతో ఏర్పాటుచేసి ఈ జెండాను రాష్ట్ర గవర్నర్ చేతుల మీదగా ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ విష్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, డిఇ.కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు నూకల సాంబ, రోశయ్య పాల్గొన్నారు.


కౌన్సిల్‌లో మాట్లాడుతున్న రామలక్ష్మి

వై.వి.సుబ్బారెడ్డిని కలిసిన ఆసీఫ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్ షేక్ ఆసిఫ్ బుధవారం రాజ్యసభ సభ్యులుగా నియమితులైన వై.వి.సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యసభ సభ్యులుగా వైవి.సుబ్బారెడ్డిని నియమించిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఆసిఫ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డిని పుష్పగుచ్చం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి మైనారిటీల పక్షపాతి అని, రాబోవు ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ నుంచి ఆసిఫ్ మంచి మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బత్తుల కొండారెడ్డి, మెట్టు వెంకటరెడ్డి, కేసరి రాజశేఖర్ రెడ్డి, చెన్నుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.


సుబ్బారెడ్డిని పుష్పగుచ్ఛంతో సత్కరిస్తున్న ఆసీఫ్

మాతృభాష ద్వారానే జీవన వైవిధ్యాన్ని కాపాడుకోగలం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : భాష సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మన జీవన వైవిధ్యాన్ని కాపాడుకోగలం అని అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు అన్నారు. బుదవారం సాయంత్రం ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, కామ్రేడ్ జిఆర్‌కె పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త నిర్వహణలో ఘంటసాల సంగీత నత్య కళాశాల లో జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిధిగా విచ్చేసిన విజయబాబు ప్రసంగిస్తూ మనిషి జీవితంలో నేర్చుకునే మొదటి భాష మాతృభాష, తల్లి ఒడే బిడ్డకు తొలిబడి, మాతభాష సహజంగా అబ్బుతుందన్నారు. అమ్మను కాపాడుకున్నట్లే మాతృభాషను కాపాడుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు, సభ ప్రారంభకులు ఎక్స్‌రే అధ్యక్షులు కొల్లూరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రత్యేక అధికారి డాక్టర్ వెలగా జోషి మాట్లాడారు. ఈ సందర్భంగా 'తొలి తెలుగు దివ్వె' తెలుగు మూలాల అధ్యయన సంఘం ద్వారా తెలుగు భాష అభ్యున్నతికి కృషిచేస్తున్న పివిఎల్‌ఎన్.రాజు (అబ్బు), మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీ తులసి దంపతులకు ఆత్మీయ సన్మానం జరిగింది. నగర ప్రముఖులు, ఇతరులు కూడా రాజు దంపతులను సత్తరించారు. పి వివిఎల్ ఎన్ రాజు, పిల్లి లక్ష్మీతులసి సత్కార అనంతరం ప్రసంగించారు. ఎన్‌జిఒ మాజీ రాష్ట్ర నాయకులు గుళ్లపల్లి నారాయణరావు రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. తొలుత సముద్రవేణి భక్తబృందం మహిళలచే మురళీ కోలాటం ఆహ్లాదపరిచింది. మహిళలు ఉత్సాహంగా, లయబద్ధంగా కోలాటంలో నృత్యం చేశారు. నాట్యకళారత్న భాగవతుల వెంకట రామ శర్మ శిష్య బృందం తెలుగు భాష గొప్పతనాన్ని కీర్తిస్తూ నృత్యంచేశారు. కళాకారులను జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. మా టీవీ నారుమంచి ఆకర్షణీయమైన వ్యాఖ్యానంతో సభను నిర్వహించారు. సిహెచ్.వి.సుబ్బయ్య, కందికొండ రవి కిరణ్, కందికొండ రవికిరణ్ కార్యక్రమ నిర్వహణలో సహకరించారు. కేసరి బి.ఆంజనేయ రాజు చివరిగా వందన సమర్పణ చేసారు.



పాఠశాలలో మాతృభాష దినోత్సవం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులు రావి, మర్రి ఆకులు, కొమ్మలపై అక్షరాలు రాసి అక్షర తోరణలు చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విసిహెచ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ప్రసాద్ బాబు, వెంకటరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువూరు : ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఆంగ్లం అవసరమే కానీ, అదే సమయంలో మాతృభాషను కాపాడుకోవాలని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.ఆదిలక్ష్మీ తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం తెలుగుతల్లి చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూలువేసి మాత భాష యొక్క ఔన్నత్యాన్ని కొనియాడారు. సిద్ధార్థ స్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా తెలుగు భాష సమితి అధ్యక్షులు తోట ఉమామహేశ్వరరావును, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ ఉప్పలపాటి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన సామినేని ఉదయభాను

ఆంజనేయ స్వామి దేవాలయంలో సామినేని పూజలు

ప్రజాశక్తి - వత్సవాయి : దేచుపాలెం గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ విగ్రహ యంత్ర, జీవధ్వజ పునఃప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను నీ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు. పెద్ద సంఖ్యలో దేవాలయ వన ప్రతిష్ట కార్యక్రమంలో ఆలయ అర్చకులు, మహిళలు, పురుషులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలతో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి : జాబ్ మేళాలు నిర్వహించడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని ఉపాధి కల్పన శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.హిమ బిందు తెలిపారు. ఉపాధి కల్పన శాఖ, జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ సంయుక్త అధ్వర్యంలో బుధవారం విజయవాడ ఉపాధి కల్పన కార్యాలయ ఆవరణలో మెగా జాబ్ బేళా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హిమ బిందు మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి కల్పిన నిమిత్తం ఉపాధి కల్పన శాఖ అందించే సేవలన్నిటిని నేషనల్ కెరీర్ సెంటర్‌తో భారత ప్రభుత్వం అనుసంధానం చేయడం జరిగింద న్నారు. యువత ఉపాధి సాధించేందుకు మెల కువలు పాటించాలని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు, రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఉపాధి, ఇంటర్వ్యూల్లో అవస రమైన కమ్యునికేషన్ స్కిల్స్ పట్ల శ్రద్ధ తీసుకో వాలన్నారు. యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని నైపుణ్యాభివద్ధి అధికారి ఎస్.శ్రీనివాస్ రావు అన్నారు. ఈ జాబ్ మేళా కు 210 మంది హాజరవ్వగా 53 మంది ఎంపి కైనట్లు విక్టర్ బాబు తెలిపారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కరువు



జగనన్న కాలనీ

ప్రజాశక్తి-పెడన

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కాలనీలో ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్న వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో అధికారులు, నాయకులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గహప్రవేశం చేసి నెలలు గడుస్తున్న ఫలితంగా ఇక్కట్లకు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే పట్టణ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన పైడమ్మ కాలనీ, పల్లోటి పబ్లిక్ స్కూల్ వెనకవైపు ఉన్న రెండు కాలనీలో దాదాపు 800 గహాల వరకు స్లాబులు వేసినట్లు ఆదివారం రికార్డులు చెబుతున్నాయి. వీటిల్లో ఇప్పటికే చాలావరకు లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకుని నివాసాలు ఉంటున్నారు. అయితే వీరందరికీ మౌలిక సౌకర్యాలైన త్రాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, రేషన్ వాహనం సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ఇంట్లో నిత్యం వాడుకుంటున్న నీరు పక్కనే ఉన్న కాళీ ప్లాట్లు రోడ్లపైకి విడుదల చేస్తున్నారు. అలాగే త్రాగునీరు పురపాలక సంఘం నుంచి వారానికి ఒకసారి మాత్రమే ట్యాంకర్ ద్వారా సరఫరా అవుతుంది అని చెబుతున్నారు. అలాగే కాలనీలో నివాసానికి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ రేషన్ తీసుకోవడం లేదని, తీసుకోవాలంటే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్నానికి చేరుకోవాల్సి వస్తుందని పల్లోటి పబ్లిక్ స్కూల్ వెనకవైపున కాలనీలో లబ్ధిదారులు వాపోతున్నారు.

మూడు నెలలుగా రేషన్ తీసుకోవడం లేదు : వరలక్ష్మి

ఈ కాలనీలో ఇల్లు నిర్మించుకొని నివాసానికి వచ్చి మూడు నెలలు అయింది. అయితే రేషన్ వాహనం ఇక్కడికి రావడం లేదు. మున్సిపాలిటీ పరిధిలో ఏ ఏ తేదీల్లో వాహనం ఎక్కడ ఉంటుందో తెలియక రేషన్ తీసుకోవడం మానేశాం. నెలలో ఒక్కసారి అయినా ఈ కాలనీలోకి రేషన్ బియ్యం ఇచ్చే వాహనాన్ని అధికారులు పంపించాలి.

డ్రైనేజీ నిర్మించాలి : కాసుల దేవి

డ్రైనేజీ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నిత్యం వాడిని మురికి నీరు పక్క ఫ్లాట్లోకెళ్తే వాళ్లు గొడవలకు వస్తున్నారు. దీంతో చేసేది లేక పగలంతా వాడిన మురికి నీటిని రాత్రి సమయంలో దూరంగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో బకెట్లతో తీసుకెళ్లి పోయాల్సి వస్తుంది. వీలైనంత త్వరగా డ్రైనేజీలు నిర్మించాలి.

వారానికి ఒకసారే మంచినీటి ట్యాంకర్ : రజియా సుల్తానా

మంచినీళ్ల ట్యాంకరు వారానికి ఒకసారి మాత్రమే వస్తుంది. అది కూడా మూడు నుంచి నాలుగు వందలు మీటర్ల దూరంలో ఉన్న మెయిన్ రోడ్డు మీద ఆగుతుంది. అక్కడి నుంచి తీసుకురావడం చాలా కష్టమైపోతుంది. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న వేసవికాలంలో మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుంది.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



'తెలుగు భాషకు ప్రాధాన్యతనివ్వాలి'

ప్రజాశక్తి-గన్నవరం

జన్మనిచ్చిన తల్లికి ఎంత ప్రాధాన్యత ఉందో అంత ప్రాధాన్యత మాతృ భాషకు ఉందని డాక్టర్ చిప్పాడ చంద్రశేఖరరావు అన్నారు. గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం చంద్రశేఖరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కార్యదర్శి దేవరపల్లి విక్టర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరావు, రిటైర్డ్ గ్రంథాలయ ఉపాధ్యాయులు సీతారామయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంగినపూడి బీచ్ అభివృద్ధి : కలెక్టర్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మండలంలోని మంగినపూడి బీచ్‌ను ఉత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. మంగినపూడి బీచ్ అభివృద్ధిలో భాగంగా బుధవారం మధ్యాహ్నం ఆయన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, స్థానిక నాయకులు పేర్ని కష్ణమూర్తి (కిట్టు)లతో కలిసి మంగినపూడి బీచ్ ఒడ్డున కొబ్బరి చెట్లను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పించి బీచ్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తద్వారా ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఇందులో భాగంగా రూ.12 లక్షల వ్యయంతో చెన్నై నుంచి మూడు వందల కొబ్బరి చెట్లను తెచ్చి నాటే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. బీచ్ సందర్శనకు వచ్చే వాహనాలకు అనువుగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నామని, వాహనాల రకాలను బట్టి పార్కింగ్ రేట్ల ధరలను నిర్ణయించి వసూలు చేసి వచ్చిన నిధులను తిరిగి బీచ్ అభివద్ధికి ఉపయోగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగర డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మీ, శీలం భారతీ నాగకుసుమ కుమారి, ముడా చైర్పర్సన్ బొర్రా దుర్గా నాగ భవాని, బందరు ఆర్డీవో ఎం.వాణి, జిల్లా పర్యాటక మేనేజర్ రామ లక్ష్మణ్, ఉద్యాన శాఖ అధికారిణి జె.జ్యోతి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు, బందరు తహసిల్దార్ పి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మంగినపూడి బీచ్‌లో చెట్లు నాటుతున్న కలెక్టర్

ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టులేరీ..?

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్టులు ఉండడం లేదు. ఆదివారం ఏదైనా ఎమర్జెన్సీ కేసు వస్తే అప్పుడు డాక్టర్ కు ఫోన్ చేస్తే వచ్చే పరిస్థితి. ప్రతిరోజు రాత్రి వేళలో కూడా ఇదే పరిస్థితి. ఈ క్రమంలో సిబ్బంది డాక్టర్లుగా మారి ప్రాథమిక వైద్యం చేస్తున్నారు. సాధారణమైన రోజుల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకే డాక్టర్లు ఉంటారు. ఆ తర్వాత చూద్దామన్నా డాక్టర్లు కనిపించరు, రాత్రివేళ ఏదైనా కేసు వస్తే వెంటనే విజయవాడ తీసుకువెళ్లిపోమని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వ చిన్నచూపు వల్ల ఈ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పన జరగడం లేదు. సాధారణ వైద్యులతోనే నడక సాగుతోంది. ఇది 40 పడకల ఆసుపత్రి. నిత్యం జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో గాయపడిన రోగులను ఇక్కడకు తీసుకువస్తారు. ఆర్థోపెడిక్ డాక్టర్ లేడు. దంత వైద్యులు ఉన్నా లేనట్లే. గన్నవరం మండలంలోని 10 గ్రామాల నుంచి వైద్యం కోసం జనం రోజు ఆసుపత్రికి వస్తారు. ఓపి 300 నుంచి 400 వరకు ఉంటుంది. ఆరుగురు డాక్టర్లు ఉన్నారు. అందరూ సాధారణమైన డాక్టర్లే. స్పెషలిస్టులు లేరు. నార్మల్ కాన్పులు చేయడం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడం వరకే ఈ ఆసుపత్రి పరిమితమైంది. ఏదైనా ఆపరేషన్ చేయాల్సి వస్తే వెంటనే అంబులెన్స్‌లో విజయవాడ పంపేస్తున్నారు. ఈ ఆసుపత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్, ఆర్థోపెడిక్, సర్జన్ పోస్టులు కావాల్సి ఉంది. వాటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదు. ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్లకు చూడడానికి రూములు కూడా లేని పరిస్థితి ఇక్కడ ఉంది. మౌలిక వసతుల కల్పన కోసం కొత్త భవన సముదాయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం తక్షణంగా ఉంది. అందుకోసం కోటి రూపాయలు కావాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. దీనికి తోడు పెద్ద ఎక్సరే మిషన్ ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ఆదివారం డాక్టర్లు రాకపోవడంతో సిబ్బంది డాక్టర్లు గా మారి రోగులకు చికిత్సలు చేసి పంపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆసుపత్రిలో స్పెషలిస్టులతోపాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.



ప్రభుత్వం నిధులు కేటాయించాలి : సిపిఎం

ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి మిరప నాగేశ్వరరావు, మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు కోరారు. ఆసుపత్రి అభివద్ధి కమిటీ లో ఉన్న నిధులను ప్రభుత్వం వేరే అవసరాలకు వాడుకోందనీ ఇది సరికాదన్నారు. ఆ తర్వాత నిధులు సమకూర్చలేదు. ఫలితంగా ఆసుపత్రిలో కరెంటు పోతే రిపేరు చేయించడానికి రూపాయి లేని పరిస్థితి. చైర్మన్ సుందర రావు సొంత డబ్బులు పెట్టి పనులు చేయిస్తున్న పరిస్థితి ఉంది. స్పెషలిస్టులను భర్తీ చేయాలి.అయితే పనులు జరగాల్సిన అవసరం ఉంది. పేద ప్రజలకు ఉపయోగపడే ఆసుపత్రి అభివద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలి. అన్ని రకాల మందులు కూడా అందుబాటులో ఉంచాలి.



పెదపారుపూడి స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి


ఎన్నికల విధుల్లో బాధ్యతగా ఉండాలి

ఎస్‌పి నయీమ్

ప్రజాశక్తి-పెదపారుపూడి: ఎన్నికల సమయంలో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్‌పి అదనన్ నయీమ్ అస్మి అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా అకస్మాత్తుగా గుడివాడ డివిజన్లోని పెదపారుపూడి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం అయిన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు ఎటువంటి అవాంతరాలు జరగకుండా నాయకులు సహకరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో కఠినంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు అన్ని గ్రామాల్లో లా అండ్ ఆర్డర్ సక్రమంగా జరుగుతుందో లేదో ఎస్ఐ స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. స్టేషన్ కు వచ్చే కేసులు ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ జి.రాజుని ఆదేశించారు. గ్రామాల్లో గొడవలు సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. గత రెండు రోజులుగా ఆంధ్రజ్యోతి రిపోర్టర్లపై, ఈనాడు కార్యాలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పెదపారుపూడి రిపోర్టర్లు ఎస్‌పి కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ డిఎస్‌పి శ్రీకాంత్, పామర్రు సిఐ శుభకారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-గుడివాడ: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా వెంకటరమణ (బాబ్జి) విగ్రహాన్ని బాబ్జి కుమార్తె శ్రావణితో కలిసి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆవిష్కరించారు. బుధవారం స్థానిక ఎజికె సెంటర్‌లో బాబ్జి సేన వ్యవస్థాపకుడు అద్దేపల్లి పురుషోత్తం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరించారు. తొలుత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, నందివాడ ఎంపిపి పెయ్యల ఆదాం, యూత్ అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, నాయకులు ఎంవి. నారాయణరెడ్డి, పాలేటి చంటి, అడపా పండు, రేమల్లి నీలాకాంత్, వీరిశెట్టి నరసింహారావు, పంచకర్ల వెంకట్, వెంపటి సైమన్, జ్యోతుల సత్యవేణి పాల్గొన్నారు.



4న గుడివాడలో 'మహిళాగళం' : కొనకళ్ల

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మార్చి 4న గుడివాడలో జరగనున్న 'మహిళాగళం'ను విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో తలశిల స్వర్ణలత అధ్యక్షతన జిల్లా మహిళా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నారాయణరావు మాట్లాడుతూ మహిళలంతా నారా చంద్రబాబు నాయుడు వెంటే ఉన్నారని తెలుపుతూ మార్చి 4న గుడివాడలో చేపట్టిన మహిళ గళం సభను విజయం వంతం చేయాలని పిలుపునిచ్చారు. టిడిపి మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపేట వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, జిల్లా అధికార ప్రతినిధులు పాలపర్తి పద్మజ మైనేందిరా, జిల్లా మహిళా కార్యదర్శి లతీ ఫున్నిసా, వాసంశెట్టి హేమావతి తదితరులు పాల్గొన్నారు.





అయాన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యాన 328 మంది కంటి పరీక్షలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ సమీపంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో బుధవారం అయాన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత మెగా నేత్ర వైద్య సేవా శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ నరసింహస్వామితో కలిసి ఆస్పత్రి గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత శర్మ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ బషీర్ అహ్మద్, ఆప్టోమెట్రిస్ట్ సాజిద్, ఆప్టీషియన్స్ నశీర్, ఆమని, అక్బర్ సేవలందించారు. పోస్టల్ ఉద్యోగులు, కార్మికులు, స్థానికులు 328 మందికి శుక్లాలు సహా అన్ని దృష్టి దోషాలపై వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, ఐ డ్రాప్స్, కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథక సమన్వయకర్త సి.హెచ్. శ్రీకాంత ప్రోత్సాహంతో మొఘల్‌రాజ్‌పురంలోని సెంటర్ ఫర్ సైట్ ఐ ఆసుపత్రి అధ్వర్యంలో ఆటోనగర్లోని కేంద్రప్రభుత్వ కార్యాలయ సముదాయంలో గల సిపిడబ్ల్యుడి కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆసుపత్రి వైద్య బందం వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న 156 మంది ఉద్యోగులకు ఉచిత నేత్ర పరీక్షలు, ఐ రిఫ్రాక్షన్ పరీక్షలను నిర్వహించింది. అలాగే ప్రస్తుతం కార్యాలయల్లో కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు వినియోగం ఎక్కువ ఉన్నందు వలన అవి కంటి చూపుపై ప్రభావితం కాకుండా ఉండేదుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను ఉద్యోగులకు వైద్య బందం తెలియజేసింది.



'ఠాగూర్'లో మాతృ భాషా దినోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నర్‌పేట ఎంజి రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో బుధవారం అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి కష్ణాజిల్లా గ్రంధాలయ సంస్థ చైర్పర్సన్ తిప్పనపల్లి జమలపూర్ణమ్మ హాజరై మాతభాష ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధికారిణి కే రమాదేవి, జ్యోతి మహిళా మండలి అధ్యక్షురాలు ఝాన్సీ రాణి పాల్గొన్నారు.





వెంకట రమణ, బ్రహ్మయ్య, సూర్యకుమారిలను సత్కరిస్తున్న లక్ష్మీపార్వతి, విష్ణు, నిమ్మరాజు చలపతిరావు

మాతృభాషా దినోత్సవంలో కవులు, రచయితలకు సన్మానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం తెలుగు, సంస్కత అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకల్లో విజయవాడకు చెందిన నలుగురిని ఘనంగా సత్కరించారు. అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ నందమూరి లక్ష్మీ పార్వతి, సంచాలకులు వి.రామకష్ణ హాజరైన ఈవేడుకల్లో ముఖ్య అతిథిగా ఎఎన్‌యు ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్, విశిష్ట అతిథిగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు పాల్గొన్నారు. వక్తలు తెలుగు భాషా సంస్కృతి విశిష్టత గురించి వివరించారు. ఆచార్య పి.వర ప్రసాద మూర్తి సభాధ్యక్షులుగా వ్యవహరించిన ఈ వేడుకల్లో రాష్ట్రవ్యాప్తంగా తెలుగు భాష అభివద్ధికి కృషి చేసిన 18 మందిని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతల్లో సీనియర్ జర్నలిస్టులు, రచయితలు యేమినేని వెంకట రమణ, అన్నవరం బ్రహ్మయ్య, ప్రముఖ నవలా, గేయ రచయిత్రి పుప్పాల సూర్యకుమారి, రచయిత్రి సునీత లఖంరాజు ఉన్నారు.



వార్డు వాలంటీర్లకు పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి బుధవారం 46 నుండి 50 డివిజన్ల వాలంటీర్లకు సేవా మిత్రా, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలు అందించారు. 221 సేవ మిత్ర, 7 సేవ రత్న, రెండు సేవ వజ్ర మొత్తం 230 పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పశ్చిమ ఇన్చార్జి షేక్ ఆసిఫ్, 47, 48, 49, 50 డివిజన్ల కార్పొరేటర్లు గోదావరి గంగ , ఎ.ఆదిలక్ష్మి , బి.విజయ్ కుమార్, బోయి సత్య బాబు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణలు : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : ఓటర్ల జాబితా సవరణ ఫారాలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పరిష్కరిస్తున్నామని కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల వరకు ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ ఎస్.డిల్లీరావు తన ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ నోటిఫికేషన్ జారీ వరకు మాత్రమే చేర్పులు, బదిలీలకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు ఎం.వినోద్ కుమార్, డీవీ కష్ణ, పి.ఏసుదాసు, వై.రామయ్య, వై.ఆంజనేయరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ నాగ లక్ష్మి పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

టెక్నాలజీపై నైపుణ్యం పెంచుకుంటే సత్ఫలితాలు

సంఖ్యలో నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పోర్టు ఆధారిత పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు అవుతున్నాయని, ఆయా సంస్థలకు అవసరమైన నైపుణ్య యువతను రాష్ట్రం ఇప్పటికే సిద్ధం చేసిందని అన్నారు. దీంతో యువత స్థానికంగానే ఉపాధి పొందుతారని మంత్రి జోగి రమేష్ వివరించారు. ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే మన యువతలో మాతభాషతోపాటు ప్రపంచ భాషగా ఉన్న ఇంగ్లీషుపై పూర్తి పట్టు సాధించాలన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రపంచ గుర్తింపు పొందిన సంస్థలతో ఒప్పందం చేసుకుని మన విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుండే ఇంగ్లీషుపై పట్టు సాధించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నగర మేయర్ రాయని భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ ఐబీ కరిక్యూలమ్‌తో ప్రపంచ స్థాయిలో పోటీపడే మన విద్యార్థులను అతి త్వరలో చూస్తామని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ యువత ప్రపంచ మార్పులకు అనుగుణంగా టెక్నాలజీలో వస్తున్న కొత్త ఆవిష్కరణలపై శిక్షణ పొందాలని సూచించారు. సంస్థ ప్రభుత్వ సలహాదారులు చల్లా మధుసూదనరెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలో మన రాష్ట్రం గుజరాత్‌ను మించిపోయి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా మేధా లాంగ్వేజ్ థియేటర్, వాద్వాని ఫౌండేషన్, టాటా ట్రెస్ట్ లిమిటెడ్ సంస్థలతో ఎంఓయులు కుదుర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఇడిఎపి చైర్మన్ ఎస్.శ్యామ్ ప్రసాద్ రెడ్డి, స్కిల్ డెవలప్ మెంట్ సంస్థ, ప్రభుత్వ సలహాదారులు జి. శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

తిరువూరు టిడిపి అభ్యర్థి రక్షణనిధి?

నేతలు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నారు. అంతేగాక తిరువూరులోని వైసిపి కార్యాలయం వద్ద జగన్ ఫోటో, పార్టీ రంగులతో కూడిన బోర్డును మంగళవారం రాత్రి రక్షణనిధి హడావుడిగా తొలగింపజేయడం కూడా ఇందుకు బలం చేకూరుస్తోంది. రక్షణనిధిని కాదని టిడిపి నుండి వచ్చిన మాజీ ఎంఎల్‌ఎ నల్లగట్ల స్వామిదాసును వైసిపి అధిష్టానం ఇన్చార్జిగా నియమించింది. దీంతో రక్షణనిధి టిడిపిలో చేరవచ్చనే ప్రచారం ఎప్పుటి నుండో ఉంది. ఈ నేపథ్యంలో ఆయనకు టికెట్ కేటాయిస్తే ఇప్పటి వరకు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జిగా ఉంటూ ఎన్నో ఆశలతో గత నాలుగేళ్లుగా పార్టీ కార్యకలాపాలను భుజానవేసుకుని నడిపిస్తున్న శావల దేవదత్తుకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆ పార్టీకి చెందిన పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏది ఏమైనా తిరువూరు రాజకీయం వాడివేడిగా సాగుతోందని ప్రస్తుత పరిస్థితి చెప్పకనే చెబుతోంది.



వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి: ప్రతిపక్షాల మాటలు భరించి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ యజ్ఞంలో గ్రామ వాలంటీర్లు నిర్విరామంగా శ్రమిస్తూ ప్రశంసలు పొందారని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక చంద్ర రాజేశ్వర రావు వికాస కేంద్రంలో మండల గ్రామ వాలంటీర్లకు వందనం కార్యక్రమం బుధవారం జరిగింది. గ్రామ వాలంటీర్లకు సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడవకొల్లు నరసింహారావు, శీరం వెంకట సత్యన్నారాయణ, సర్పంచ్లు తోట శ్రీనివాసరావు, వల్లూరు ఉమా, మాతంగి రమ్య తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఉత్తర్వులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని కవుతరం గ్రామంలోని కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హై స్కూల్లో జూనియర్ కాలేజ్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రదోనోపాధ్యాయురాలు ఎంవిఎన్ఎల్ పద్మావతి బుధవారం తెలిపారు. ఈ కాలేజీలో ఎంపీసి, బైపిసి, సిఇసి కోర్సులను జూన్ నుండి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఈ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయటంలో కృషి చేసిన ఎమ్మెల్యే కొడాలి నాని కు, జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక రాములకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ లోని ఏ వన్ మార్క్ సమావేశ మందిరంలో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండలాలకు చెందిన దివి కెమిస్ట్ అండ్ డ్రగ్గేస్ట్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక బుధవారం అవనిగడ్డలోని ఏవన్ మార్ట్ భవనం సమావేశమహాల్లో నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా ధన సురేష్, కార్యదర్శిగా ఎం విజయ్ కుమాం, ట్రెజరర్‌గా సుధాకర్, కమిటీ సభ్యులుగా చెట్టా వెంకట చంద్రశేఖర్, నంబూరి రాజేష్, కోడూరు సాయి, అన్నం వెంకట సుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

50వ డివిజన్‌లో 'మన డివిజన్-మన సమస్యలు'

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రామకృష్ణ చేపట్టిన మన డివిజన్ మన సమస్యలు కార్యక్రమం బుధవారం మచిలీపట్నంలోని 50వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను అక్కడున్న సమస్యలను డివిజన్ ఇంచార్జ్ రామినాయుడు, టిడిపి 50 డివిజన్ ఇంచార్జ్ నాగరాజుతో కలిసి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సరైన డ్రైనేజ్ సిస్టం లేకపోవడం వల్ల మురుగునీరు నిలిచిపోయి ప్రజల అనారోగ్యానికి దారితీస్తుందన్నారు.

ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలి : బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ: ప్రాథమిక విద్య మాతభాషలో నేర్పినప్పుడే భాషను పరిరక్షించుకోగలమని మాజీ ఉత్సవా పతి మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. బుధవారం గాంధీ క్షేత్రంలో దివిసీమ సాహితీ సమితి అధ్యక్షులు గుడిసేవ విష్ణు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సభలో బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. యునెస్కో వారు మన జాతీయ విద్యా విధానం ప్రాథమిక విద్య మాతృభాషలో చెప్పాలని సూచించిన రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఫలితంగా తమ పేర్లు కూడా తెలుగులో రాయలేని పరిస్థితుల్లో పిల్లలు ఉంటే భాషా పరిరక్షణ ఏ విధంగా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. భాష నశిస్తే జాతి నశిస్తుం దన్న సత్యాన్ని తెలుగు వారు గుర్తించాలని బుద్ధ ప్రసాద్ సూచించారు. ఈ సందర్భంగా తెలుగు తల్లి విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ



తెలుగు తల్లికి నివాళులర్పిస్తున్న బుద్ధప్రసాద్

కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, టిడిపి నాయకులు బండే రాఘవ తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఐవిపై కళాజాత

ప్రజాశక్తి-చల్లపల్లి: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ విభాగ వారి సమర్పణలో జిల్లాలోని ప్రజలకు హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ మరియు నిర్మూలనకై కళాకారులు స్థానిక ఏటీఎం సెంటర్లో బుధవారం అవగాహన కల్పించారు. హెచ్ఐవి నిర్ధారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు అర్బన్ హెల్త్ కేంద్రం ఏర్పాటు చేసినటువంటి ఐసిటిసి సెంటర్స్ కి వెళ్లి రక్త పరీక్ష చేయించుకోవాలని అన్నారు. టి శేఖర్ కళాబందం వీధి నాటికలు, పాటలు, నాటికలు రూపంలో హాస్యపు సన్నివేశాలతో ప్రదర్శనలు చేసి ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని 8, 47 ,3 వ డివిజన్‌లలో సిసి రోడ్లకు మచిలీపట్నం నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) శంకుస్థాపన చేశారు. మూడు డివిజన్లకు సంబంధించి సుమారు 111 లక్షల రూపాయలు ముడా నిధులతో పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడం జరిగిందని కిట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్‌లు మడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, హరి, శీలం బాబ్జి, శ్రీరామ్ లక్ష్మణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందుల షాపు ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజలకు సబ్సిడీ ధరలకే మెడిసిన్స్ అందించేందుకు ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ షాపును సద్వినియోగం చేసుకోవాలని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు.బుధవారం స్థానిక పీఏసీఎస్ ఆవరణలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం, ఫార్మాస్యూటికల్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా చేపట్టిన కార్యక్రమం ద్వారా పీఏసీఎస్ ఆవరణలో నూతన జనరిక్ మందుల దుకాణాన్ని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, వైఎస్సార్సీపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల వ్యవసాయ విభాగం జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఈ జనరిక్ మందుల దుకాణంలో 1,759 రకాల మందులు, 280 రకాల సర్జికల్ పరికరాలు 50 నుంచి 90 శాతం రాయితీపై లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శీరం వెంకట సత్యన్నారాయణ, యలవర్తి నగరాజకుమారి, పీఏసీఎస్ అధ్యక్షులు పాగోలు నాగ సీతారామారావు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, ఆది రాంబాబు, యార్లగడ్డ సత్యాంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ: మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో అక్షయ డెవలపర్ అధినేత మాదివాడ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వెంకటకృష్ణ జనసేన పార్టీలో చేరిన సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పాస్టర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించి వారికి వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంఓల ఆచార్య శామ్యూల్ మోటుపల్లి, పెదపూడి విజయ్‌కుమార్, రాయపూడి వేణుగోపాలరావు, కొండవీటి సునీత, ఉస్మాన్ షరీఫ్, మరే గంగయ్య, రత్న గోపాల్, సర్పంచ్‌లు తుంగల శ్రీలక్ష్మి, కనకాల వెంకటేశ్వరరావు, లోలాక్ష నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మత్స్య పరిశ్రమపై జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న మధుబాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మత్స్య పరిశ్రమపై జాతీయ సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ ప్రధాన విభాగపు అధిపతి కడిమి మధుబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మత్స్యకార రంగంపై ఆధారపడిన రైతులు మత్స్యకారులు స్థితిగతులు వారి ఆదాయం పెంపుకు తీసుకోవలసిన చర్యలు సాంకేతిక ప్రభావం మత్స్యకారులు ఎదుర్కొంటున్న సవాళ్లు ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఎగుమతులు గ్లోబలీకరణ ప్రభావం గురించి వివరించారు. హైదరాబాదుకు చెందిన ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ డైరెక్టర్ టి ఎల్ ఎన్ స్వామి మాట్లాడుతూ సాధారణ అంతర్ పంటల మాదిరి రైతులు ఆక్వా ఫోనిక్స్ అంతర్ పంటలు చాపలు మొక్కలు ఒకే కాలంలో వేసి రైతు ఆదాయం పెంచుకోవచ్చు అన్నారు. ఫిష్ సెంటర్స్ ఏర్పాటు చేసి శీతలీకరణ రవాణా మార్కెట్ సదుపాయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఎకనామిక్స్ అసోసియేషన్ ట్రెజరర్ కార్యదర్శి ప్రొఫెసర్ ఎం కోటేశ్వరరావు, సభ్యులు కె పరమేశ్వరరావు, సెమినార్ కన్వీనర్ వీరకుమారి పాల్గొన్నారు. ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ యూనివర్సిటీల పరిధిలోని 50 మంది పరిశోధన పత్రాలు సమర్పించారు. టెక్నికల్ సెషన్ చైర్మన్‌గా ప్రొఫెసర్ కె.పరమేశ్వరరావు పరిశోధన పత్రాల సారాంశాన్ని వివరించారు.

సెయింట్ ఆన్స్‌లో సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సైన్స్ ఫేర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌విఎల్ క్రాంతి కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రారంభించారు ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన పలు సైన్స్ ప్రాజెక్టులను వీక్షించారు.



ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ మౌళి థామస్, సిస్టర్ అమలాపుష్పం, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మోని పాల్గొన్నారు.

గుడివాడలో టిడిపి ప్రచారం


ప్రజాశక్తి-గుడివాడ : టిడిపి ఇంచార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో బుధవారం 17వ వార్డులో బాబు ష్యూరిటి భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పాత సంతరోడ్డులోని సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పించి ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్, పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, లింగం ప్రసాద్, ముళ్ళపూడి రమేష్‌చౌదరి, పాలంకి సారథి, బత్తిన భద్రాచలం, మరీదు రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు విరాళం

ప్రజాశక్తి-గన్నవరం: బుద్ధవరం గ్రామంలోని రెండు ఆలయాలకు గన్నవరం నియోజవర్గ టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు మూడు లక్షల రూపాయల నగదు విరాళంగా అందజేశారు. గ్రామంలో బుధవారం శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న వెంకట్రావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి రెండు లక్షల రూపాయలను అందజేశారు. అనంతరం శ్రీ సీతారామాలయానికి లక్ష రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడవల్లి భవానీ ప్రసాద్, లక్ష్మీ, నాగరాజు, శివరామకృష్ణ, ఆరుమల్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఘంటసాల: ప్రజల వద్దకు పరిపాలన తీసుకురావాలనే ఉద్దేశంతో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వాలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఘంటసాలలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కళ్యాణమండపంలో గ్రామ వాలంటీర్ల సేవలకు సత్కార వేడుక బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 242 మంది వాలంటీర్లను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల వ్యవసాయ విభాగం జోనల్ ఇన్చార్జి కడవకొల్లు నరసింహారావు, ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, ఎంపీపీ వేమూరి రజనీకుమారి, వేమూరి ప్రవీణ్, కుంపటి నాగేంద్ర బాబు, మాడెం నాగరాజు, కోఆప్షన్ సభ్యులు మస్తాన్ వలి, సర్పంచులు రాచూరి ప్రసాద్ బాబు, గుత్తికొండ రామారావు, ముళ్లపూడి పట్టాభి రామారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-గన్నవరం: అంతర్జాతీయ మాతభాష దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సూరంపల్లిలో ర్యాలీ, వ్యాస రచనలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ కవులు, రచయితల ఫోటోలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు టీచర్ శ్రీమతి డా. పి.సుభాషిణి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రావ్యకు అరుదైన పురస్కారం



ప్రజాశక్తి - గంపలగూడెం : దేశంలో ప్రముఖ ఆవిష్కరణల పురస్కారం అయిన ఏజిస్ గ్రహంబెల్ పురస్కారం మండలంలోని ఊటుకూరుకు చెందిన పద్మనాభుని నాగశ్రావ్యకు లభించింది. భీమవరం విష్ణు మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న ఆమె కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఏజిస్ 14వ ఎడిషన్ పోటీలకు దరఖాస్తు చేసుకుని వారు నిర్వహించిన రాత పరీక్ష, కోడింగ్, టెక్నికల్ రౌండ్ నెగ్గి డేటా సైన్స్ ప్రాజెక్టును చక్కగా వివరించడంతో విజయం సాధించింది. ఈ సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలోని ఎన్డిఎంసి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఏజిస్ 14వ ఎడిషన్ గ్రాండ్ అవార్డు వేడుకలో కేంద్ర రవాణా,రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేతులమీదుగా డేటా సైన్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేయుటకు 7 లక్షల రూపాయల స్కాలర్ షిప్ అందుకుంది. కేంద్ర సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి నారాయణ్ రాణే చేతులమీదుగా ఏజిస్ గ్రహంబెల్ పురస్కారం, ప్రసంసాపత్రం అందుకుంది. దేశవ్యాప్తంగా మొత్తం 30 మందిని ఎంపిక చేయగా, అందులో శ్రావ్య ఒకరు.



స్థానికులతో మాట్లాడుతున్న షేక్ ఆసీఫ్

ప్రజా సంక్షేమమే వైసిపి లక్ష్యం

గడప గడపకూ కార్యక్రమంలో ఆసీఫ్

ప్రజాశక్తి - భవానీపురం : ప్రజా సంక్షేమమే వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వ లక్ష్యమని వైసిపి పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసీఫ్ తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలోని 41వ డివిజన్‌లో కార్పొరేటర్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ మరియు అభ్యర్థి షేక్ ఆసీఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ ఎండి ఇర్ఫాన్ డివిజన్‌లో ప్రతి గడప గడపకి వెళ్ళి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు, సంక్షేమ పథకాలు, విద్యా, వైద్యం పూర్తిగా అందుతున్నాయా అని తెలుసుకొని ప్రజలతో మమేకమయ్యారు. డివిజన్లో డ్రైనేజీ, నీటి సమస్యల గురించి అధికారులతో మాట్లాడి ప్రజ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు బండి పుణ్యశీల, కార్పొరేటర్లు పడిగపాటి చైతన్య రెడ్డి, పాత శివాలయం చైర్మన్ బొమ్మ మధు, శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు మెంబర్ కేసరి చిన్నోడు, హయాత్, మధిర ప్రభాకర్, ఏనుగుల సునీల్, మండల శ్రీనివాసరావు , షేక్. అబ్దుల్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వాటర్ పంపింగ్ హౌస్ పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మైలవరం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు బుధవారం వాటర్ పంపింగ్ హౌస్‌ను పరిశీలించారు. డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ లోని మొదటి ఆరు యూనిట్ల ఈఎస్పీ సిస్టమ్ ద్వారా బూడిద లోడింగ్ జరిగిన తర్వాత కిందపడిన బూడిదను పొడిగా ఉన్నప్పుడే ఎత్తకుండా పైపులైన్ ద్వారా వచ్చే వాటర్‌తో ఫ్లోర్ క్లీనింగ్ చేయడం వల్ల, ఆ బూడిద కాలువల ద్వారా వచ్చి బుడమేరు ద్వారా బయటకు వస్తుందని, దీని ద్వారా తాగునీరు కలుషితమవుతుందని అన్నారు. సర్నాల ఫోన్ ద్వారా ప్రభుత్వ అధికారులతో చర్చించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను కోరారు.

24న మెగా ఎడ్యుకేషన్ లోన్‌మేళా



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : వియ్ ఫండ్ యువర్ ఫ్యూచర్ ఆధ్వర్యంలో ఈనెల 24న పటమటలోని మేరిస్ స్టెల్లా ఆడిటోరియంలో 'మెగా ఎడ్యుకేషన్ లోన్ మేళా' నిర్వహించనున్నట్లు సంస్థ మేనేజింగ్ పార్టనర్ సాయికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మేళా వివరాలను తెలియచేసేందుకు నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వియ్ ఫండ్ యువర్ ఫ్యూచర్ అనేది నమ్మకమైన ఆర్థిక భాగస్వామి సంస్థ అన్నారు. తమ సంస్థ బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలతో భాగస్వామ్యం కలిగి ఉందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు విదేశాలలో ఉన్నత విద్యా కోర్సులను అభ్యసించాలనుకుంటారన్నారు. అయితే ఆర్థికంగా సరైన సమయంలో నగదు సమకూరలేక కొన్ని ఇబ్బందులు పడుతుంటారని అటువంటి వారికి తమ సంస్థ తగిన విధంగా సహాయ సహకారాలు అందించి విదేశాలలో ఉన్నత విద్యావకాశాలను కల్పించే సంస్థ అన్నారు. ప్రస్తుతం విదేశాలలో విద్యావకాశాల గురించి ఆయా విశ్వవిద్యాలయాలు అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయని అటువంటి వారికి విద్యాలోన్ అందించేందుకు విద్యాలోన్ మేళా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ మేళాలో వివిధ బ్యాంకులు, స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తాయని విద్యార్థులతో స్వయంగా మాట్లాడిలోన్ అవకాశం కల్పిస్తాయన్నారు. విద్యార్థులకు వీసా, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలో సహాయ, సహకారాలను అందించి వారికి సంబంధించిన ఫైనాన్షియల్ అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మూడు రోజులలోనే విద్యారుణం కోటి రూపాయల వరకు అందించే అవకాశం ఉందని తెలిపారు. ప్రీ శాంక్షన్ లోన్‌కు సంవత్సరానికి 9.5 శాతం నుండి వడ్డీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ లోన్ మేళాకు హాజరుకావడం ద్వారా అమెరికా, కెనడా వెళ్లాలనుకునే విద్యార్థులకు 200 యుఎస్ డాలర్లు నగదు కూపన్ అందించనున్నట్లు తెలిపారు. విలేరుల సమావేశంలో నిర్వహణా కమిటీ సభ్యులు శాంతారెడ్డి, వీర రాజేష్ పాల్గొన్నారు.

23 నుండి దస్తకార్ బజార్ ప్రదర్శన



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుండి నగరంలోని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో విజయవాడ దస్తకార్ బజార్ – 2024 వస్త్ర ప్రదర్శనను ఏర్పాటుచేస్తున్నట్లు క్రాఫ్ట్స్ కౌన్సిల్ అధ్యక్షురాలు రంజన, తెలిపారు. మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుండి వంద మంది కళాకారులు వారి చేతితో తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శనగా ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. వెదురు, మట్టి, వెండి, మెటల్, చెక్క, గాజు, తోలుతో తయారుచేసిన వస్తువులను ఏర్పాటుచేస్తారన్నారు. ప్రదర్శన ఈ నెల 23 నుండి 29వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని తెలిపారు. నగర వాసులు వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు రశ్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని సిఐటియు నిరసన



కార్మికులతో మాట్లాడుతున్న సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నగరంలో మున్సిపల్ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు పశ్చిమ నగర ఉపాధ్యక్షులు బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. సమ్మెకాలం ఒప్పందాలు జీవోలు విడుదల చేయాలని కోరుతూ బుధవారం 51, 52 డివిజన్ల విఎంసి కార్మికులతో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పశ్చిమ నగర ఉపాధ్యక్షులు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించినటువంటి రాష్ట్ర ప్రభుత్వం చేసిన పనికి సకాలంలో జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహించడం అన్యాయమని తెలిపారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి అయిదు సంవత్సరాలు అవుతున్నా అమలు చేయకుండా మోసగించడాన్ని కార్మికులు తగిన విధంగా బుద్ధి చెప్తారని అన్నారు. జనవరి నెల జీతం నేటికీ విడుదల చేయకుండా, సమ్మెకాలం ఒప్పందాలు అమలు చేయకుండా, సెలవులు లేకుండా పనులు చేయమని వేధింపులు గురిచేయడం శోచనీయమన్నారు. ఇంజనీరింగ్ పార్క్ సెక్షన్, స్ట్రీట్ లైటింగ్ కార్మికులకు వేతనాలు పెంపుదల చేయకుండా కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నారని వెంటనే ఉన్నతాధికారుల కమిటీ రిపోర్టులను బహిర్గతం చేసి వేతనాలు పెంపు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు యూనిఫామ్, నూనె, చెప్పులు, గుర్తింపు కార్డులు వంటి కూడా అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విఎంసి కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన



ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి : విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం చాలా కీలకమైనదని దీనిపై అవగాహన కలిగి ఉండాలని వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు కోఆర్డినేటర్లు టి సునీత రాణి, కె.సునీత అన్నారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో విజయవాడ కృష్ణలంక బాలాజీనగర్‌లోని మహిత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులకు బుధవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మానసిక వ్యాధులు, ప్రమాదాల గురించి విద్యార్థులకు వివరించారు. మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థుల్లో వయసు పెరిగే కొద్ది వచ్చే మానసిక, శారీరక మార్పుల గురించి తెలుసుకోవాలన్నారు. ఆ మర్పులను అర్థం చేసుకొని వాటికి అనుగుణంగా ప్రవర్తించే విధానాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. బాల్య వివాహాల గురించి కూడా అవగాహన కల్పించారు. సమాజానికి చేటు చేకూర్చే బాల్య వివాహాలను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరు భాగ స్వామ్యం కావాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతని తెలియజేస్తూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహితా స్కూల్ హెచ్‌ఎం కె వరలక్ష్మి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శామ్‌సంగ్ గెలాక్సీ బుక్ 4 ప్రీ బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ గెలాక్సీ బుక్ 4 సిరీస్ కోసం ప్రీ బుకింగ్‌ను ప్రారంభించినట్లు శాంసంగ్ షోరూమ్ మేనేజర్ కె.రాజశేఖర్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని షోరూమ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. గెలాక్సీ బుక్ 4 సిరీస్ పట్ల ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారని అందుకే ముందుగా ప్రీ బుకింగ్స్ ప్రారంభించినట్లు తెలిపారు. నూతన గెలాక్సీ బుక్4లో ఇంటరాక్టివ్ డిస్‌ప్లే, మరింత స్పష్టమైన స్క్రీనింగ్, బలమైన సెక్యూరిటీ సిస్టమ్‌తో వస్తుందని తెలిపారు. ఇప్పటికే బుకింగ్స్ ప్రారంభించామని ఆసక్తి కల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అత్యధిక విక్రయాల మార్కు దాటిన స్కోడా ఆటో కారు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రెండేళ్లలో లక్ష విక్రయాల మార్కును అధిగమించినట్లు స్కోడా ఆటో ఇండియా సంస్థ డైరెక్టర్ పీటర్ తెలిపారు. నగరంలోని స్కోడా ఇండియా డీలర్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశ:లో ఆయన మాట్లాడారు. స్కోడా ఇండియా కారు ఎంతో మందిని ఆకట్టుకుంటుందని తెలిపారు. నూతన టెక్నాలజీతో ఎప్పటికపుడు ఆధునికంగా రూపొందించారన్నారు. ఫైవ్ స్టార్ సేఫ్, క్రాష్ టెస్టెడ్ సెడాన్ స్లావియా అత్యంత స్టైల్‌తో కూడిన కారుగా ఉందని తెలిపారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికపుడు సరికొత్తగా కారును తీసుకువస్తున్నట్లు తెలిపారు. స్కోడా ఆటోకు సంబంధించి 200పైగా సేల్ టచ్ పాయింట్లలో అందుబాటులో ఉందని వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు.

తైక్వాండో పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో మెగా టోర్నీలో కరెన్సీనగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరచి పతకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత పొట్లూరి తెలిపారు. కరెన్సీ నగర్‌లోని చైతన్య పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు హాసిని, అమూల్య, శ్రీ నిఖిత, శ్రీ మోహిత్‌లు పతకాలు సాధించారని తెలిపారు. ఈసందర్భంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎజిఎం ఎం.మురళీకృష్ణ, ఆర్.ఐ.వి. నరేంద్రలు విద్యార్థులను అభినందించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం పరిధిలోని 33/11 కె.వి. సబ్ స్టేషన్‌లో లైన్ల మరమత్తులలో భాగంగా ఈనెల 22వ తేదీ గురువారం ఉదయం 8 నుండి 10 గంటల వరకూ భవానీపురంలోని వెంకటేశ్వర ఫౌండ్రి రోడ్, హైవే రోడ్ వెంకటేశ్వర ఫౌండ్రి నుండి స్వాతి థియేటర్ వరకు, ఆశ్రమం రోడ్, బేతపూడి అరుణకుమారి రోడ్, బాజి బాబా మందిరం రోడ్, సభాపతి రోడ్, ఔట్ ఏజెన్సీ మరియు మీరా సాహెబ్ రోడ్ వరకు. ఎంఐజి ఐరన్ యార్డ్, హెచ్.బి. కాలనీ, స్వాతి రోడ్లలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.